ముగిసిన జాతర టెండర్లు

- చింతగట్టు సమ్మక్క–సారలమ్మ జాతర టెండర్ల ఆదాయం రూ.8.65 లక్షలు


వేలం నిర్వహిస్తున్న అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం, రంగరాయగూడెం, కోమటిగూడెం, అక్కపెల్లిగూడెం గ్రామాల పరిధిలోని చింతగట్టు సమ్మక్క–సారలమ్మ జాతరకు సంబంధించిన టెండర్లు మంగళవారం ముగిశాయి. దేవాదాయ శాఖ ఈఓ లక్ష్మీప్రసన్న అధ్యక్షతన జాతర ఉత్సవ కమిటీ బాధ్యులు, ఆయా గ్రామాల పెద్దల సమక్షంలో మంగళవారం టెండర్ల ప్రక్రియ చేపట్టారు. ఇప్పగూడెం, రంగరాయగూడెం, కోమటిగూడెం, అక్కపెల్లిగూడెం గ్రామాల్లో సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణం వద్ద బంగారం, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, కూల్ డ్రింక్స్, కోళ్ల అమ్మకానికి, తలనీలాలు పోగు చేసుకోవడానికి వేర్వేరుగా బహిరంగ వేలం వేశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు వాగ్వాదాలు, వాదనల మధ్య వేలం పాటలు నిర్వహించారు. ఎట్టకేలకు సాయంత్రం టెండర్ల ప్రక్రియ ముగిసింది. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ మొత్తంగా టెండర్ల ఆదాయం రూ.8.65 లక్షలు వచ్చిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే తగ్గిందని, గత ఏడాది టెండర్ల ఆదాయం రూ9.26 లక్షలు వచ్చిందన్నారు. టెండర్ల ద్వారా వచ్చిన ఆదాయంతో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జాతర వద్ద అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామన్నారు. జాతర వద్ద చదును చేయడం, చలువ పందిళ్లు వేయడం, ఎలక్ట్రిసిటీ, పారిశుద్ధ్యం, నీటి సౌకర్యం, గద్దెల వద్ద బారికేడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని, నిబంధనల మేరకు అందరూ పనిచేయాలని, జాతర విజయవంతానికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీఐ సట్ల రాజు, ఎస్‌ఐ నాగరాజు, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్లు సుమతి, అనీల్‌కుమార్, చిల్పూరు, పాలకుర్తి దేవాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతరలో అభివృద్ధి పనులు ప్రారంభం

ఇప్పగూడెం చింతగట్టు సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణం వద్ద రూ.8.90 లక్షలతో చేస్తున్న అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతర ఉత్సవ కమిటీ బాధ్యుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, మాజీ చైర్మన్ మందపురం ఎల్లగౌడ్, రంగరాయగూడెం ఎంపీటీసీ నెలమంచ శైలజ అజయ్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ తదితరులు సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవ్వరూ పంతాలు పట్టింపులకు పోకుండా అందరం కలిసి జాతర అభివృద్ధి పనులు చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ సమ్మక్క–సారలమ్మ అమ్మవార్ల జాతరను విజయవంతం చేసేలా బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీప్రసన్న, వివిధ పార్టీల నాయకులు కత్తుల కట్టయ్య, చట్ల యాకయ్య, ఎండీ.మహిపాషా, పల్లె రవీందర్, మంద రాజు, గొడిశాల యాదగిరి, ఐత వీరేశం, కొడెపాక యాకయ్య, హుస్సేన్, ఐత రమేష్, చట్ల రాజు, సంతోష్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సోమయ్య

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బైక్ ర్యాలీని మంగళవారం నిర్వహించారు. వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నక్క యాకయ్య, యాతం సమ్మయ్య, కాట సుధాకర్, గుండెబోయిన రాజు, వేల్పుల పెద్ద రాములు, రవి, శీను, సోమయ్య, రాజు, శంషోద్దీన్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అవినాష్

నర్మెట: దేశాభివృద్ధి పేదల సంక్షేమం, మహిళా సాధికారత లాంటి అంశాలు బీజేపీతోనే సాధ్యమని గావ్ చలో బస్తీ, చలో అభియాన్ మండల కోకన్వీనర్ బొల్లం అవినాష్ అన్నారు. మంగళవారం మండలంలోని కన్నెబోయిన గూడెంలో, ధరావత్ తండాలో పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాల కరకపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి పనుల్లో 70 శాతం కేంద్ర నిధులే ఉన్నాయని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు ఇంటింటా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు ధరావత్ దేవేందర్, గోరంతల వెంకటేష్, అర్జున్, నవీన్, వెంకటేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి


జనగామ రూరల్: బాల్కసుమన్ చిత్రపటాన్ని చెప్పులతో కొడుతున్న మహిళలు


స్టేషన్‌ఘన్‌పూర్: సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్/నర్మెట/తరిగొప్పుల/జఫర్‌గఢ్/లింగాలఘణపురం/దేవరుప్పుల/పాలకుర్తి: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సీఎంపై సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ పలు మండల కేంద్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బాల్క సుమన్ దిష్టిబొమ్మతో ర్యాలీ తీసి చెప్పులతో కొడుతూ రహదారిపై దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమన్ బేషరతుగా క్షమాపణ చెప్పకుంటే కాంగ్రెస్ శ్రేణులచే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి , బుచ్చిరెడ్డి, సత్యనారాయణ, సిద్ధిరాములు, ఇందిర, జయ, కౌన్సిలర్ అనిత, రామచంద్రం, రామగళ్ల విజయ్ పిట్టల సతీష్, నాగరబోయిన శ్రీరాములు, జగదీష్‌చందర్‌రెడ్డి, గుర్రం యాదగిరి, మంతెన ఇంద్రారెడ్డి, కీసర దిలీప్‌రెడ్డి, గంగం నర్సింహారెడ్డి, భూక్య జయరాం, బత్తిని అశోక్, రామలింగం, అన్నెబోయిన భిక్షపతి, నూకల ఐలయ్య, పెద్ది కృష్ణమూర్తి గౌడ్, ధారావత్ రాజేష్ నాయక్, భూక్యా సజ్జన్ నాయక్, భిక్షపతి, శ్రీనివాస్, వంశీకృష్ణ, రాపాక సత్యనారాయణ, కృష్ణమూర్తి, సురేష్, ధరావత్ రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పాలకుర్తిలో సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సుమన్‌పై చర్య తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ నాయకుడు గాదెపాక భాస్కర్ ఎస్సై శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. తరిగొప్పుల మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్, కోఆర్డినేటర్ వగలబోయిన యాదగిరి మాట్లాడుతూ బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, ముఖ్యమంత్రిపై తీవ్ర పదజాలం ఉపయోగించడం సిగ్గుచేటని అన్నారు. కనుకయ్య, శ్రావణ్‌రెడ్డి, రమేష్, పోషిరెడ్డి, ఇంద్రారెడ్డి ఉన్నారు.

‘చెకుముకి’ పోటీలను విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్, తదితరులు

జనగామ రూరల్: రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ పోటీలను విజయవంతం చేయాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ చేతుల మీదుగా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించడంతో పాటుగా మూఢ విశ్వాసాలను తొలగిస్తుందన్నారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో చెకుముకి పోటీలు జరుగుతాయని, 33 జిల్లాల నుంచి ప్రతినిధులు, విద్యార్థులు, టీచర్లు, శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. ప్రొఫెసర్లు లక్ష్మారెడ్డి, బీఎస్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, జిల్లా కార్యదర్శి రవీందర్, శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రింట్ మీడియా సమస్యలపై వినతి



జనగామ: ప్రింట్ మీడియా అసోసియేషన్ ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కావాల్సిన మౌలిక సదుపాయాలను పరిష్కరించాలని జనగామ ప్రింట్‌మీడియా ప్రతినిధులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తాడూరి సంతోష్‌రాజు, కార్యదర్శి బచ్చు విశ్వనాథ్, గౌరవ అధ్యక్షుడు నంద లక్ష్మణ్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గన్ను కార్తిక్, మహ్మద్ ఖలీల్, పాము ప్రభాకర్, మనోజ్, మణితోపాటు తదితరులు పాల్గొన్నారు.

దేవునిగుట్టను పరిరక్షించుకుందాం..


మాట్లాడుతున్న రమేష్

దేవరుప్పుల: రాజకీయాలకతీతంగా ఐక్య సంఘటనతో దేవునిగుట్ట విధ్వంసం కాకుండా పరిరక్షించుకుందామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారపు రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో కడవెండి మాదాపురం ధర్మపురం రెవెన్యూ పరిధిలో అనుసంధానంగా ఉండే దేవునిగుట్ట పరిసరాల్లో క్వారీ అనుమతులను ప్రభుత్వం సత్వరమే రద్దు చేయాలని డిమాండ్‌తో సీపీఐ జిల్లా నాయకుడు బిల్లా తిరుపతిరెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వ్యవసాయ రంగాభివృద్ధితో హరితహారం హరించుకపోతున్న క్రమంలో ప్రకృతి సిద్ధమైన గుట్టలపై చెట్లు ప్రాణవాయువు ఇచ్చే ప్రధాన జీవనాధారంగా ఉందన్నారు. క్వారీ తవ్వకాల అనుమతులను సత్వరమే రద్దు చేయాలని, లేనట్టయితే రాజకీయాలకతీతంగా తమ ఉద్యమకార్యాచరణతో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, సీపీఐ జిల్లా నాయకుడు బిల్లా తిరుపతిరెడ్డి, సీపీఎం మండల నాయకుడు గద్దం యాదగిరి,బీఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాపాక శ్రీశైలం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నరసింహులు, కాంగ్రెస్ నాయకులు మహేందర్‌జీ, సోమనర్సోజీ, కాంగ్రెస్ యూత్ విభాగం నియోజకవర్గ, మండల అధ్యక్షులు ధారావత్ రాజేష్,అనిల్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్యా సజ్జన్, రమేష్, సందీప్, ప్రకాష్ , ఉమేష్, నిఖిల్, అశోక్, శ్రీకాంత్, నాగరాజు, ఎల్లప్ప పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడాలి

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడాలని పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి సూచనల మేరకు ఊరూరా పట్టభద్రులు నమోదు చేసుకున్న ఓటు హక్కు వినియోగించుకునేలా తోడ్పాటు అందించాలని, ప్రజాపాలన ద్వారా కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలు, నిరుద్యోగ యువత ఉద్యోగ కల్పన వంటి చర్యలపై వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో యూత్ మండల అధ్యక్షుడు ఉప్పుల అనిల్, ప్రకాష్,ఉమేష్, నిఖిల్, సందీప్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నర్మెట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడంతో మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ జెడ్పీటీసీ గాదె మోహన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి, కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ కుమారస్వామి, నాయకులు శ్రీధర్, రామకృష్ణ పాల్గొన్నారు.

చెక్ డ్యాంల నిర్మాణంతో భూగర్భజలాల పెంపు


పనులు చేపడుతున్న లోడీ సంస్థ ప్రతినిధులు

తరిగొప్పుల: చెక్ డ్యాంలు నిర్మించడంతో వర్షం నీరు వృథా కాకుండా ఉంటుందని, నీటి నిల్వతో భూగర్భజలాలు పెరిగి వ్యవసాయ బావులు, బోరు బావుల్లో నీటిమట్టం పెరుగుతుందని ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాలశౌరి అన్నారు. లోడీ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మానోస్ యూనిదాస్ సహకారంతో లోడీ సంస్థ డైరెక్టర్ ఫాదర్ సింగారెడ్డి ఇన్నారెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని జాలుబాయితండా, బొంతగట్టునాగారం గ్రామాల్లో చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టారు. కాగా, నిర్మాణం పనులను ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. మండల కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, సిబ్బంది కనకం రవీందర్, భూక్య బిచ్చ, ముడావత్ తిరుమల, పిల్లి రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంసీహెచ్ సందర్శన



జనగామ: జనగామ మండలం చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ సుగుణాకర్‌రాజుతో కలిసి అదనపు కలెక్టర్.. ఎంసీహెచ్ సేవలపై ఆరా తీశారు. ఓపీ, జనరల్, ప్రసూతి, పిల్లల వార్డు, వైద్యుల పనితీరు తదితర విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించి తెలుసుకున్నారు.

సమ్మయ్యకు సన్మానం



దేవరుప్పుల: పద్మశ్రీ పురస్కారానికి ఎన్నికైన గడ్డం సమ్మయ్యను ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ జాతీయ పురస్కార గ్రహీత, తెలంగాణ రాష్ట్ర ఒగ్గుబీర్ల కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఒగ్గు రవి ఆత్మీయ సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక కళారంగంతో మనుగడ ఉన్న క్షేత్రస్థాయి కళాకారులకు జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం గుర్తింపు, రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. చిందు యక్షగాన కళాకారులు శ్రీరంజనీ, సోమరాజు, వెంకయ్య, గణపతి తదితరులు ఉన్నారు.

ఒగ్గు కళాకారుడు రవికి..

పాలకుర్తి టౌన్: ఒగ్గు కళాకారుడు రవి డాక్టరేట్ సాధించడంతో మంగళవారం మండలంలోని లక్ష్మీనారాయణపురంలో ఒగ్గుడోలు కళాకారుల బృందం కళాకారులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాల్యాల సరిత పరశరాములు, బిడిగె ప్రదీప్‌గౌడ్, ఒగ్గు కళాకారులు కృష్ణ, వీరస్వామి, రమ,దయ్యాల ధనమ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ యాదగిరి మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన పల్లె గౌతమి, సుతారి రిషిత, శనబోయిన పూజ ఇటీవల హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో పోటీల్లో పాల్గొని క్రీడా ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. కాగా ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఎండీ పర్వేజ్, ఉపాధ్యాయులు అభినందించారు.


‘ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సరికాదు’

జనగామ రూరల్: మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం అన్నారు. ఈ మేరకు జనగామ చౌరస్తాలో నల్ల జెండాలతో మంగళవారం నిరసన ప్రదర్శ చేపట్టారు. ఒక ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడిపై చేసిన వ్యాఖ్యలు ప్రజలు గమనిస్తున్నారని తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. మండల నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

పాలకుర్తి టౌన్: అయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు సాధించొచ్చని ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అధికారి పూజారి వరుణ్ అన్నారు. మంగళవారం మండలంలోని తొర్రూరులో రైతులు సాగు చేసిన పామ్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ రైతులకు బంగారు భవిష్యత్‌ను ఇస్తుందని తెలిపారు. మాజీ సర్పంచ్ నాయిని మల్లారెడ్డి, రైతులు గోనె రవి, చిదురాల ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహచారి పాల్గొన్నారు.

ఎన్నిక


శ్రీధర్, శ్రీనివాస్

జనగామ రూరల్: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్‌యూటీఎఫ్ ముందంజలో ఉందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బి.శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాస్, ఉపాధ్యాక్షులుగా జి.నాగరాజు, హిమబిందు, కోశాధికారిగా సుధీర్‌రెడ్డి, కార్యదర్శులుగా దామోదర్ రెడ్డి, కిషన్, ఆరోగ్య మేరీ, మమత, మల్లారెడ్డి, ఆంజనేయులు, తదితరులు ఎన్నికయ్యారు.

పాస్టర్లకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

స్టేషన్‌ఘన్‌పూర్: పాస్టర్లు, ఫాదర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని సెయింట్ పాల్స్ స్కూల్ అధినేత, కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ టికెట్ ఆశిస్తున్న అనంద్‌కుమార్ అన్నారు. స్థానిక బేతేలు చర్చిలో నియోజకవర్గంలోని ఏడు మండలాల పాస్టర్ల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. పాస్టర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బాలస్వామి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అనంతరం ఆనంద్‌కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ టికెట్ రావాలని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

చిల్పూరు: పార్టీకి పునాదులు గ్రామ కమిటీలేనని, గ్రామంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని ఫత్తేపూర్‌లో మంగళవారం నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు నూతన కమిటీని పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ ప్రకటించారు. అధ్యక్షుడిగా గుగులోత్ రమేష్, ఉపాధ్యక్షులుగా లునావత్ మోహన్, గద్ద అనిల్, ప్రధాన కార్యదర్శిగా మానేపల్లి భాస్కర్, కార్యదర్శులుగా రాజయ్య, శ్రీనివాస్, కుమార్, కోశాధికారిగా వేల్పుల గట్టుమల్లు, సలహాదారులు కొమ్రూ, రాజు, సిద్దులు, శ్రీనివాస్, గౌరవ సభ్యులుగా ఉమ్లానాయక్, రాంలాల్, బాలరాజు, వెంకట్రాములు, గౌరవ అధ్యక్షుడిగా బానోత్ వీరన్నను ఎన్నుకున్నారు.

అష్టదళ పాద పద్మారాధన పూజ

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్తజనసందోహం నడుమ బంగారు పుష్పాలతో అష్టదళ పాద పద్మారాధన పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మాలతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజ చేశారు. ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి, జిల్లా రాజు–సుష్మిత , గుల్లపల్లి శ్రీనివాస్–భవాని, సంగోజు మోహనాచారి–శంకర్‌లక్ష్మి, సిబ్బంది రమేష్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఎల్‌ఈడీ టీవీల బహూకరణ

జఫర్‌గఢ్: కూనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామ వ్యాస్తవ్యుడు, ఎన్ఆర్ఐ పల్లెపాటి రాజ్‌కుమార్‌రెడ్డి రూ.80 వేల విలువైన రెండు ఎల్ఈడీ టీవీలు, సౌండ్‌బాక్స్‌లను తండ్రి మల్లారెడ్డి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా పాఠాలు బోధించేందుకు ఎల్ఈడీ టీవీలు దోహదం చేస్తాయన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలకు ఎల్ఈడీ టీవీలు, సౌండ్‌బాక్స్‌లు అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి డబ్బులు చెల్లించాలని నిరసన

జనగామ రూరల్: ఉపాధి డబ్బులు చెల్లించాలని మండలంలోని యశ్వంతాపూర్ గ్రామానికి చెందిన కూలీలు జనగామ బజార్ పోస్టాఫీస్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. గత ఆరు నెలల నుంచి పోస్టాఫీస్‌లో జమ చేసిన ఉపాధి డబ్బులు ఇవ్వడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఖాతాలుహెడ్ ఆఫీస్ నుంచి పట్టణంలోని బజార్ పోస్టాఫీస్‌కు 14 గ్రామాల ఖాతాలు మార్చారని, నెలల తరబడి ఖాతాలో ఉన్న డబ్బులు ఇవ్వకుండా సాకులు చెబుతున్నారని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి తమకు రావల్సిన డబ్బులు ఇచ్చేలా చూడాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలి

రఘునాథపల్లి: మండలంలో నేటి నుంచి 15 వరకు అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎండీ హషీం సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి పారిశుద్ధ్య పనులపై గ్రామసభలు

పాలకుర్తి టౌన్: పారిశుద్ధ్య పనులపై గ్రామాల్లో బుధవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వనపర్తి అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

జనగామ రూరల్: గ్రామాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న అభివృద్ధి పదవిముగిసిన సర్పంచ్‌ల సమష్టి కృషితో సాధ్యమైందని ఎంపీపీ మేకల కళింగ రాజు అన్నారు. మంగళవారం మండలం కేంద్రంలో మాజీ సర్పంచ్‌ల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎంపీడీఓ త్రివిక్రమ్, ఎంపీఓ సంపత్ కుమార్, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బెల్టుషాపులను అరికట్టాలి

పాలకుర్తి: గ్రామాల్లోని మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులను అరికట్టాలని సీపీఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఐలమ్మ స్మారక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టులు షాపుల్లో మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సత్యం, సోమన్న, నాగయ్య, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు గ్రామంలో రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ సభ్యురాలు కనకం స్వరూపగణేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడారు. స్పెషల్ ఆఫీసర్, డీటీ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అశ్విన్‌రెడ్డి, కారోబార్ చిరంజీవి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు చేపట్టాలి



బచ్చన్నపేట: చిన్నారుల్లో పలురకాల అనారోగ్య సమస్యలు కలిగించే నులిపురుగుల నివారణకు చర్యలు చేపట్టాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆస్పత్రి ఆవరణలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి, వైద్యులు మహేష్, రూప, సౌజన్య పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

దేవరుప్పుల: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని కస్తూర్బా హాస్టల్ ప్రత్యేకాధికారి సుకన్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జెడ్పీ మాక్ సమావేశాన్ని బాలికలు నిర్వహించారు. జెడ్పీ మోడల్ సమావేశంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

కృష్ణయ్యను కలిసిన బీసీ నాయకులు

లింగాలఘణపురం: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు చిర్ర వీరస్వామి, సందెన భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు.

బీఆర్ఎస్ సభకు తరలిరండి

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ సమావేశానికి కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి రావాలని బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ ఎండీ ఫిరోజ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. జనగామలోని పసరమడ్ల స్టేజీ వద్ద ఉన్న ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో నేడు (బుధవారం) నిర్వహించే నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.

ఉపాధి పనులతోనే పల్లెల అభివృద్ధి

దేవరుప్పుల: ఉపాధి హామీ పనుల శాతంతోనే ఆయా గ్రామాల అభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేటాయింపు జరుగుతుందని ఎంపీడీఓ వడ్డెపల్లి ఉమామహేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపల్లిలో కొనసాగుతున్న ఉపాధి హామీ ఫీడర్ చానెల్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

పరామర్శ

నర్మెట: మండలంలోని మల్కపేట గ్రామ మాజీ ఉప సర్పంచ్ బానోత్ బాల్సింగ్ తల్లి బానోత్ తారమ్మ మృతి చెందింది. కాగా మంగళవారం పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: కొన్నె గ్రామంలో ఇటీవల బొర్ర పెద్దులు మృతి చెందాడు. కాగా, బీఆర్ఎస్ నేత కోడూరి శివకుమార్ బాధిత కుటుంబీకులను పరామర్శించి రూ. 5 వేల సాయం అందజేశారు.

బియ్యం అందజేత

పాలకుర్తి టౌన్: తొర్రూరులో అనారోగ్యంతో సర్దార్ యాదమ్మ మృతి చెందింది. కాగా మంగళవారం చుక్కా రామయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు పుల్లయ్య ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

ఆలేరురూరల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ (33) యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలోని ఓ ప్రైవేట్ డెయిరీలో పనిచేస్తూ నియోజకవర్గ కేంద్రంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. రోజూ మాదిరిగా సోమవారం మధ్యాహ్నం విధులు ముగించుకుని ఆలేరుకు బైక్‌పై బయలుదేరాడు. ఆలేరు శివారుకు రాగానే ఎదురుగా వస్తున్న తుపాన్ వాహనం శ్రీకాంత్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో గల ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు.మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటశ్రీను తెలిపారు.

దొంగ అరెస్టు

బచ్చన్నపేట: మండలంలోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసినట్లు ఎస్సై కంకల సతీష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నర్మెట మండలం మల్కపేట గ్రామానికి చెందిన మాచర్ల రాజు ఆరు నెలల క్రితం పోచన్నపేట దుర్గామాత ఆలయంలో, సాల్వాపూర్‌లో కొండపోచమ్మ ఆలయంలో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అనుమానస్పదంగా కనిపించగా విచారించడంతో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకోవడంతో సొత్తు రికవరీ చేసికోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. కాగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన వెల్లడించారు. దొంగను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్సై కంకల సతీష్‌తో పాటు కానిస్టేబుల్ జమాలొద్దీన్, అనిల్‌ను జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి అభినందించారు.

రిమాండ్

బచ్చన్నపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన బాలుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై కంకల సతీష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాలికపై అత్యాచారం చేసినందుకు పోక్సో చట్టం కింద ఆరు కేసులు నమోదు చేసినట్లు వివరించారు.